క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో గంగమ్మ

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు, గాజులతో, పూలదండలు, వేపమండలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు పట్టి, జంతు బలులు ఇచ్చారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందులో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్ర స్వామికి, ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

పరీక్ష తేదీలు ప్రకటించాలి



మాట్లాడుతున్న శివకుమార్

కమలాపురం: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష తేదీలు ప్రకటించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షలకు తేదీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 2022 నవంబర్ 28న 6,100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలకు 4.52 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఇందులో 92వేల మంది అర్హత సాధించారని తెలిపారు.

పవిత్రతకు ప్రతిరూపం రంజాన్



బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న తిప్పాయపల్లె సుబ్బారెడ్డి

కమలాపురం: రంజాన్ పండుగ పవిత్రతకు ప్రతిరూపమని షిర్డీ సాయి రైస్ మిల్ యజమాని, మాజీ ఉప సర్పంచ్ తిప్పాయపల్లె సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం ఇందిమ్మకాలనీ, రైల్వే గేటు, బీడీ కాలనీకి చెందిన 60 కుటుంబాలకు ఆయన బియ్య పాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేద ప్రజలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం పుణ్యకార్యంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఏటా పేద ముస్లింలకు బియ్యం బస్తాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ మైసూరారెడ్డి, ఎర్రబల్లి సుబ్బారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ భవనాలకు స్థలాలు కేటాయించండి

వేంపల్లె : అన్ని జిల్లా కేంద్రాల్లో బ్రాహ్మణులు అపర కర్మలు నిర్వహించు వడానికి బ్రాహ్మణ భవనాలు లేవని వాటి నిర్మాణానికి స్థలాలు ప్రభుత్వం కేటాయించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు సూగురు రఘునాథ్‌రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పీవీఎస్‌వీ ప్రసాదరావు ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 5 సంవత్సరాలుగా కార్పొరేషన్ లేక బ్రాహ్మణులు నష్ట పోతున్నారని తెలిపారు. బ్రాహ్మణులు అపర కర్మల నిర్వహణ కోసం ఇతర ప్రాంతాలకు పోవాల్సి వస్తోందని పేర్కొన్నారు.

పులివెందుల అర్బన్ సీఐగా చాంద్‌బాషా

పులివెందుల రూరల్: పులివెందుల అర్బన్ సీఐగా చాంద్‌బాషాను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న నరసింహులు వేంపల్లెకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడపలో పనిచేస్తున్న చాంద్‌బాషాను పులివెందుల సీఐగా నియమించారు. ఆయన సోమవారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు చేపటనున్నారు.

ఘనంగా శ్రీరామనామంతో ర్యాలీ

బ్రహ్మంగారిమఠం : ఉగాది శ్రీ విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా ఆదివారం సాయంత్రం తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి ఆధ్వర్యంలో శ్రీరామ నామం నినాదంతో భక్తులు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. బి.మఠం, కందిమాల్లాయపల్లె, తోట్లపల్లె తదితర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. తోట్లపల్లె నుంచి బ్రహ్మంగారిమఠం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని, పంచాగ పఠనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి విరజానందస్వామి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భక్తితో కూడిన విలువలను పాటించాలన్నారు. మంచికి అవకాశం ఇచ్చి, చెడుకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యల తిష్ట.. తొలగేదెట్టా..!

- మురికి కూపాలుగా కాలనీలు
- అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పేరుకుపోయిన చెత్తా చెదారం



వీధుల్లో లోపించిన పారిశుద్ధ్యం

వేంపల్లె : వేంపల్లి గ్రామపంచాయతీలో సమస్యలు తిష్ట వేశాయి. ఆయా కాలనీల్లో ఎక్కడ చూసినా రహదారులు, డ్రైనేజీ నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో ఒక వైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మరీ దారుణం. రోడ్లపైనే రోజుల తరబడి మురుగు నీరు ఉండటం మరింత ఇబ్బందికరంగా మారింది. నెలరోజుల క్రితం అవినీతి ఆరోపణలపై ఇక్కడ పనిచేస్తున్న ఈఓ వెంకటసుబ్బారెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి వేంపల్లి గ్రామపంచాయతీలో డ్రైనేజీ, పారిశుద్ధ్య వ్యవస్థలు అధ్వానంగా తయారయ్యాయి.

తీవ్రంగా తాగునీటి సమస్య

ముఖ్యంగా వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలు ఎవరికి చెప్పాలో దిక్కుతోచని స్థితిలో ప్రజలు ఉన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు కూడా చెల్లించలేదు. గ్రామ పంచాయతీకి సంబంధించి ఇంటి, నీటి పన్నులు, నాన్ టాక్స్ పన్నులు కట్టించుకునే వారే కరువయ్యారు. మార్కెట్ వేలం పాట సోమవారంతో ముగుస్తుంది. పంచాయతీకి ఆదాయాన్ని తెచ్చే మార్కెట్ వేలం పాట నిర్వహించే నాథుడే లేడు. కూటమి ప్రభుత్వంలో నేతలు వర్గ పోరుతో గ్రామపంచాయతీలో పనిచేసేందుకు ఏ అధికారి ముందుకు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు లేక సమస్యలు తీరక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



వీరారెడ్డి



సుబ్బరాయుడు

వేంపల్లె : ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఉద్యోగుల పెన్షనర్ల విభాగం పులివెందుల నియోజకవర్గ అధ్యక్షుడు వీరారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉద్యోగులు, పెన్షనర్ విభాగం పులివెందుల నియోజకవర్గం అధ్యక్షుడిగా బండి వీరారెడ్డిని నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. వేంపల్లెకు చెందిన మాజీ రిటైర్డ్ ఎంఈఓ వీరారెడ్డి సేవలను వైఎస్సార్ సీపీలో వినియోగించుకొనేందుకు ఉగాది పండుగ రోజున వైఎస్సార్ సీపీ ఉద్యోగ, పెన్షనర్ విభాగానికి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ అధినేత జగన్ మోహన్ రెడ్డి నియామక పత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈఓ బండి వీరారెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గ అధ్యక్షుడిగా నియమించినందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, ఉద్యోగులు, పెన్షనర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర శేఖర్ రెడ్డికి, వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు కతజ్ఞతలు తెలిపారు.

చింతకొమ్మదిన్నె : వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలానికి చెందిన మాతంగి సుబ్బరాయుడిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సుబ్బరాయుడు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డికి, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజనేయరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

ప్రొద్దుటూరు : విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామినీ శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ వార్షికోత్సవం, ఉగాది పర్వదినం సందర్భంగా నాలుగు మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు ఉగది –షడ్రుచుల విశిష్టత అనే అంశంపై వ్యాసరచన, నేటి సమాజంలో సంస్కృతి – సంప్రదాయాలు అనే అంశంపై వక్తృత్వ, బాలురకు కబడ్డీ, బాలికలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతి మాతాజీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, శ్రద్ధతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్ట్ సభ్యులు గోపినాథ్‌రెడ్డి, పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణ, మునిశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న శివదర్శనానంద సరస్వతి మాతాజీ

అంకాలమ్మకు వెండి ముఖ కవచాలు వితరణ



వెండి కవచాలను చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

పులివెందుల టౌన్ : ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక అంకాలమ్మ ఆలయంలో అంకాలమ్మతల్లి ద్వారాలలో ఉన్న అమ్మవార్లకు మూడు కిలోల వెండి కవచాలను బహూకరించారు. ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, ఈఓ కేవీ రమణకు ఆదివారం దాతలు అందజేశారు. పల్లెటి వెంకట అశోక్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మిట్ట మల్లికార్జునశెట్టి కుటుంబ సభ్యులు మిట్టకరుణాకర్, మిట్ట మంజునాథ్, గండి దేవస్థాన ఏఈ నిఖిల్ కుటుంబ సభ్యులు, కడియాల నాగసుబ్బరాయుడు కుటుంబ సభ్యులు సంయుక్తంగా కలసి అమ్మవారికి వెండి కవచాలను చేయించాలని తలచి ఉగాది పండుగరోజున అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సురేష్ వారిని మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ అమ్మవారి వెండి కవచాలను పట్టుకొని ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు అలంకరించారు.

టిడ్కో ఇళ్లకు మౌలిక వసతుల కల్పన



అల్లసాని పెద్దన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని టిడ్కో ఇళ్లను మరో మూడు నెలల్లో లబ్ధిదారులకు ఇచ్చేందుకు, రూ.9 కోట్లతో మౌలిక సదుపాయలను కల్పిస్తున్నామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. శనివారం ఎర్రగుంట్ల పట్టణంలోని నాల్గు రోడ్ల కూడలిలో అల్లసాని పెద్దనామాత్యుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎర్రగుంట్ల మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయిస్తున్నామని చెప్పారు. అనంతరం మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ప్రస్తుతం రోడ్లు, డ్రైనేజీ నీటి సదుపాయాల పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. అక్కడి నుంచి వెళ్లివై. కోడూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డితో కమిషనర్ శేషఫణి పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఆదివారం ఉగాదిని పురస్కరించుకుని అంకాలమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, మాజీ ఉప ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు రామాంజనేయులు, రామ్మోహన్‌లు అంకాలమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఈ పోటీలలో వరుసగా ఐదు స్థానాలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు రూ.1,00,116లు, రూ.80,116లు, రూ.60,116, రూ.40,116, రూ.20,116లు నగదు బహుమతులు అందజేశారు.

- మండల వ్యాప్తంగా విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. తెలుగు నూతన సంవత్సరం కావడంతో ప్రతి హిందువు ఇళ్లను, వాహనాలు శుభ్రం చేసుకుని మామిడాకులతో అలంకరించుకున్నారు.

శిల్పారామంలో నూతనోత్సాహం

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



జానపద నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా పురోహితులు శర్మచే పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వేదాంత హాస్పిటల్ సౌజన్యంతో శ్రీరాజా కళానిలయం మాస్టర్ రాజా ఆధ్వర్యంలో జానపద, శాస్త్రీయ నృత్యాలతోపాటు సినీగీతాలకు చిన్నారుల నృత్యాలు అందరిని అలరించాయి. ఉగాది పండుగ కావడంతో సందర్శకులతో శిల్పారామం నిండుకుండలా కనువిందుచేసింది.



కోలాటం ఆడుతున్న చిన్నారులు

ఈద్గాలో ప్రార్థనలకు ఏర్పాట్లు

- నేడు ఈద్–ఉల్–ఫితర్
- నెలవంక దర్శనంతో ముగిసిన రంజాన్ మాసం



కమలాపురం ఈద్గాలో ఏర్పాట్లు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

కమలాపురం: ముస్లింలు ఈద్–ఉల్–ఫితర్ పండుగను సోమవారం నిర్వహించుకోవాలని దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా పీఠాధిపతి హజరత్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి తెలిపారు. ఆదివారం రాత్రితో రంజాన్ మాసం ముగిసిందని, షవ్వాల్ నెల మొదటి రోజును ఈద్–ఉల్–ఫితర్ పండుగగా నిర్వహించు కోవాలని ఆయన తెలిపారు. ప్రతి ముస్లిం రంజాన్ పండుగను కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా నిర్వహించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ఈద్గాలో ఏర్పాట్లు సిద్ధం

కమలాపురం పట్టణంలోని ఈద్గాలో ఈద్ నమాజ్ ఆచరించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉదయం గం.9.30 నిమిషాలకు నమాజ్ చదవడానికి అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేశామని, 10 నిమిషాల ముందే ఈద్గా చేరుకోవాలని ప్రభుత్వ ఖాజీ నాసీర్ హుసేనీ తెలిపారు. అలాగే రైల్వే గేటు సమీపంలోని అక్సా నగర్ గ్రౌండ్ వద్ద 8.30 గంటలకు ఈద్ నమాజ్ ఆచరిస్తున్నట్లు హజరత్ తాహెర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పెద్ద దర్గాలోని మసీదులో 10గంటలకు నమాజ్ చదివేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు దర్గా సెక్రటరీ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ తెలిపారు.

గంగమ్మా.. కరుణించవమ్మా..!



పూజలందుకుంటున్న కొండగంగమ్మ

పెండ్లిమర్రి: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల ఉత్సవాలు మూడవ రోజు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

కొండ గంగమ్మ తిరునాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. పోటీలను ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.



బండలాగుతున్న ఎద్దులు

ధర లేక దిగాలు

- తగ్గిన అరటి రేట్లు
- సాయం కోరుతున్న అన్నదాత



పులివెందుల ప్రాంతంలో సాగు చేసిన అరటి పంట

పులివెందుల రూరల్ : ప్రస్తుతం అరటి ధరలు మార్కెట్‌లో అమాంతంగా తగ్గిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అరటి కాయలు టన్ను రూ.5 వేల నుంచి రూ.8 వేలు పలుకుతున్నాయి. ఇటీవల కురిసిన ఈదురుగాలులు, వడగండ్ల వానకు అరటి గెలలు నేలకూలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీనికితోడు ధరలు తగ్గిపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. గతంలో టన్ను రూ.16 వేల నుంచి రూ.18 వేలు పలికాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అరటి ధరలు చాలా తక్కువగా ఉండటంతోపాటు ఈదురు గాలులు, వానలకు దెబ్బతిన్న అరటి పంటలను చూస్తూ దిగాలు చెందుతున్నారు. నష్టపోయిన తమకు ప్రభుత్వం సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. అలాగే అరటికి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

విశ్వావసు.. విజయోస్తు

- ఘనంగా ఉగాది వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పంచాగ శ్రవణం పఠించిన అర్చకులు



పులివెందుల టౌన్ : ప్రత్యేక అలంకారంలో అంకాలమ్మ



చక్రాయపేట: ప్రత్యేక రథంలో ఊరేగుతున్న వీరాంజనేయుడు



ముద్దనూరు: అమ్మవారిశాలలో పూజలు చేస్తున్న అర్చకుడు

సింహాద్రిపురం: తెలుగు ప్రజలకు ముఖ్యమైన మొదటి పండుగ ఉగాది. ఈ ఉగాది వేడుకలను మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పండుగ రోజున గ్రామీణ ప్రాంతాల్లో ఊయలు వేసుకుని ఆనందంగా గడిపారు.

పులివెందుల రూరల్: మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది పంటలు బాగా పండి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని దేవుళ్లను వేడుకుంటారు.

అందరూ సుభిక్షంగా ఉండాలి

వేంపల్లె : నూతన సంవత్సరంలో అందరూ సుభిక్షంగా ఉండాలని బీజేపీ నేతలు ఆకాంక్షించారు. ఆదివారం వేంపల్లిలో కడప రోడ్డులో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్, జనసేన నాయకుడు డాక్టర్ హరీష్, దొంతు సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో విశ్వావసునామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయాలలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఇష్ట దైవాలను ఆరాధించి కాయకర్పూరాలు సమర్పించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున ప్రజలు లేచి స్నానాలను ఆచరించి ఇంటి దేవుని మూల తమ ఆరాధ్య దైవానికి పల్లెం వేశారు. ఆలయాలవద్ద పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. అదివారం కావడంతో పట్టణంలోని అంకాలమ్మ ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా గ్రామోత్సవం

చక్రాయపేట: విశ్వావసు నామ సంవత్సరం (ఉగాది పర్వదినం) సందర్భంగా గండి వీరాంజనేయ స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గండి పురవీధులతో పాటు సమీపంలో ఉన్న వీరన్న గట్టుపల్లెలో ఊరేగింపు జరిగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి స్వాగతించారు. ఆలయ అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు రఘు, సాయి, వేద పారాయణదాసు, రామ్మోహన్‌శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపించారు.

ముద్దనూరు: నూతన సంవత్సరం విశ్వావసు నామ ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సాయంత్రం పంచాగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. పలువురు భక్తులు పంచాగ శ్రవణంలో పాల్గొన్నారు. వ్యవసాయం, రాశిఫలాలను అర్చకులు మురళీకృష్ణ శర్మ పంచాంగ శ్రవణంలో వివరించారు.

ఆనందోత్సాహాలతో ఉగాది

వల్లూరు: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను మండలంలోని ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పిల్లలు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. ఉమ్మడిగా డ్రమ్ములకు రంగులను కలుపుకుని చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకలను చేసుకున్నారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరంలో రాశి ఫలాలను గురించి తెలుసుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపించారు. పంటల దిగుబడులు, ధరలు, రాజకీయాల స్థితి గతులను గురించి తెలుసుకోవడానికి ఉత్సాహం చూపారు. దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీలో వసంతోత్సవాన్ని యువకులు ఉత్సాహంగా జరుపుకున్నారు.

నేడు బండలాగుడు పోటీలు

పెండ్లిమర్రి: ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల సందర్భంగా ఆదివారం ఎద్దులతో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు మొదటి బహుమతి లక్ష రూపాయలు ఇవ్వనున్నారు. మరో తొమ్మిది ఎద్దుల యజమానులకు బహుమతులు ప్రదానం చేస్తారు.



వల్లూరు: రంగులు చల్లుకుంటున్న యువకులు



వేంపల్లె : ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న నాయకులు